నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 14 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

కాంగ్రెస్‌వి బోగస్ హామీలు

భోగి మంటల్లో హామీ పత్రాలను వేసి నిరసన తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ హామీ పత్రాలను భోగి మంటల్లో వేసి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేట, జనవరి 13 : రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన అంతా మోసమేనని, ఇచ్చినవన్నీ బోగస్ హామీలేనని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలో సోమవారం భోగి పండుగను పురస్కరించుకుని రేవంత్‌రెడ్డి మోసపూరిత హామీల పత్రాలను భోగి మంటల్లో వేసి తగలబెట్టి బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా కేసీఆర్ అమలుచేసిన సంక్షేమ పథకాలకు కోతలు విధించి ప్రజలను అన్యాయం చేస్తున్నదని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నివర్గాల ప్రజలు, రైతులు కాంగ్రెస్ పాలనలో దగా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని, ప్రస్తుతం రాక్షసపాలన సాగుతోందని అసంతృప్తి వెలిబుచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులు, బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిత్యం పోరాడుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి భవిష్యత్ కేసీఆరేనని, ఆయనతోనే బంగారు తెలంగాణ నిర్మాణం సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ, మోటూరి మోహన్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇల్లెందు, జనవరి 13 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికులు ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షావలి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గత కేసీఆర్ ప్రభుత్వ పీఆర్సీ కమిటీ నివేదిక ప్రకారం మున్సిపల్ కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాల్సి ఉండగా.. ప్రస్తుతం రూ.15,600 మాత్రమే చెల్లిస్తుండడంతో ఏమాత్రం సరిపోక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అలాగే ఈ నెల 19న మహబూబాబాద్‌లో జరగనున్న తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మల్లెల వెంకటేశ్వర్లు, నాయిని కృష్ణ, విక్రమ్, వెంకన్న, కుమార్, శ్రీధర్, భారతి, భూలక్ష్మి, ఉమా, మంగమ్మ, భాగ్యమ్మ, కృష్ణవేణి, రాజేశ్వరి, అనిల్, రాములు, నాగరాజు పాల్గొన్నారు.

ఇల్లెందు : పతంగులు ఎగురవేస్తున్న యువకులు, చిన్నారులు

సత్తుపల్లి : భోగిమంటల వద్ద కుటుంబసభ్యుల సందడి

ఇంటింటా భోగిభాగ్యాలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఘనంగా వేడుకలు
- చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వాదాలు
- గాలిపటాలు ఎగురవేస్తూ యువత సందడే సందడి
- ఇళ్లల్లో ఘుమఘుమలాడిన పిండివంటలు
- నేడు మకర సంక్రాంతి పర్వదినం

ఇంటింటా భోగభాగ్యాలు నింపింది భోగి. పల్లెలన్నీ భోగి మంటల్లో మెరిసిపోయాయి. ప్రజలంతా భోగి సంబురాల్లో మురిసిపోయారు. ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఊరూవాడా సోమవారం భోగి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా పల్లె, పట్నం తేడాలేకుండా తెల్లవారుజామున భోగి మంటల్లో పాత వస్తువులను వేసి దహనం చేశారు. మహిళలు ఉదయాన్నే ఇళ్ల ముంగిళ్లు, ఆవరణను నీటితో శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. ఇంటిగుమ్మాలను బంతిపూలతో అలంకరించారు. బంధువులను ఇళ్లకు పిలిచి చిన్నారులకు భోగి(రేగి పండ్లు) పండ్లు పోసి ఆశీర్వదించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువతీ యువకులు ఖాళీ ప్రదేశాలతోపాటు ఇళ్లపైకి ఎక్కి గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. మహిళలు సకినాలు, అరిసెలు వంటి పిండివంటల్లో నిమగ్నమయ్యారు. బంధువులు, మిత్రులు పరస్పరం భోగి పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.
నేడు(మంగళ వారం) మకర సంక్రాంతి పండుగను ప్రజలంతా ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. - నమస్తే నెట్‌వర్క్

చుంచుపల్లి : భోగిమంటలు వెలిగిస్తున్న మహిళలు

పాల్వంచ రూరల్ : ఇందిరా కాలనీలో ఇంటి ముందు ముగ్గులేస్తున్న యువతులు

కారేపల్లి : ముగ్గు వేస్తున్న మహిళలు

బీఆర్ఎస్‌పై కాంగ్రెస్‌ది కక్షసాధింపు

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు సబబు కాదు: రేగా

మాజీ ఎమ్మెల్యే రేగా

మణుగూరు టౌన్, జనవరి 13: బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టంచేశారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ కార్యాలయాలపైనా, నాయకులపైనా, ప్రజాప్రతినిధులపైనా ఇలాంటి దాడులు చేయిస్తోందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి, అరెస్టు వంటివి కూడా ఇందులో భాగమేనని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు కూడా స్వేచ్ఛ లేకుండా పోయిందని అన్నారు. కౌశిక్‌రెడ్డి ఒక ప్రజాప్రతినిధి అయినప్పటికీ.. అతడి హోదాను కూడా లెక్కచేయకుండా పోలీసులతో అరెస్టు చేయిండచం సబబు కాదని అన్నారు. ఎమ్మెల్యేపై దాడి కేసులో పోలీసులు అరెస్టు చేయడం, హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు తరలించడం దారుణమని అన్నారు.

కార్పొరేషన్‌తో కామ్రేడ్ల కలవరం

- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై సీపీఎం రెండు నాలుకల ధోరణి
- సుజాతనగర్‌లోని ఏడు పంచాయతీలను కలపొద్దని పట్టు
- మరోవైపు కార్పొరేషన్‌కు వ్యతిరేకంకాదంటూ ప్రకటనలు

కొత్తగూడెం కలెక్టరేట్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 13 (నమస్తే తెలంగాణ) : కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుపై కామ్రేడ్ల వైఖరి రెండు నాలుకల ధోరణిగా కనిపిస్తున్నది. పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలతోపాటు సుజాతనగర్ మండలంలో 7 గ్రామ పంచాయతీలను కలిపి కార్పొరేషన్ చేయడానికి ప్రభుత్వ అనుమతి రావడంతో కామ్రేడ్లలో కలవరం మొదలైంది. కార్పొరేషన్ అయినట్లు అధికారికంగా ప్రకటించిన మరుసటిరోజు నుంచే పల్లెలను పట్టణంలో కలపొద్దని సీపీఎం పార్టీ తన వాయిస్‌ను ప్రజల్లోకి తీసుకురావడంతో లెఫ్టు పార్టీల మధ్య మళ్లీ గ్యాప్ రాబోతుందా.. అంటే సమాధానం ఎవరూ చెప్పలేకపోతున్నారు. కార్పొరేషన్‌కు సీపీఎం పార్టీ వ్యతిరేకం కాదంటూనే మరోపక్క సుజాతనగర్‌లో ఉన్న ఏడు పంచాయతీలను కార్పొరేషన్‌లో కలపొద్దని డిమాండ్ చేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాని విషయంగా మారింది.

ఎమ్మెల్యే కృషితో..

నిన్న మొన్నటి వరకు కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు మున్సిపాలిటీలుగా ఉన్న సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొత్తగూడెంను కార్పొరేషన్ చేయాలని గత ప్రభుత్వాలకు సైతం విన్నవిస్తూ వస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంతో పొత్తులో కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన గూడెం అభివృద్ధినే అజెండా పెట్టుకుని ముందుకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌ను తెరపైకి తీసుకొచ్చి అభివృద్ధికి బీజం వేశారు. దీంతోపాటు విమానాశ్రయానికి కూడా గ్రీన్‌సిగ్నల్ తెప్పించారు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం కార్పొరేషన్ కావడంతో రెండు పట్టణాల ప్రజలు ఆయన కృషిని అభినందించారు. మరోవైపు క్షీరాభిషేకాలు కూడా చేస్తున్నారు. సుజాతనగర్‌లో ఒక వర్గం మద్దతు కూడా తెలిపారు.

ఆ ఏడు జీపీలను కలపొద్దని సీపీఎం పట్టు

కొత్తగూడెం కార్పొరేషన్ అవడంలో మాకు ఎలాంటి అభ్యతరం లేదు అని సీపీఎం బహిరంగంగా చెబుతూనే పల్లెలను పట్నంలో కలపొద్దనే డిమాండ్ కూడా అదే తరహాలో చేస్తున్నది. సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కార్పొరేషన్‌లో కలపొద్దని స్థానిక ఎమ్మెల్యేను కలవడంతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కూడా కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఏడు పంచాయతీలను కలపడం వల్ల ఉపాధి అవకాశాలు పోతాయని, రైతులు పొలాలను అమ్ముకుని కూలీలుగా మారే అవకాశాలు ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగి పొలాలు మిగలవని వారు ఈ డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు.

చట్టం చిక్కుముడులు విప్పేదెవరో?

పాల్వంచ, రామవరం పరిధి ఏజెన్సీ ఏరియాలో ఉండడంతో అక్కడ ఉన్న చట్టం ఎవరి పరిధిలోకి వస్తుందని గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. గిరిజన చట్టాలు ఉన్న ప్రాంతంలో గతంలో పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదని అప్పట్లో ప్రచారం జరిగింది. అసలు ఎన్నికలు జరగకపోవడానికి కారణం నేటికి ఎవరికీ తెలియకపోవడం విశేషం. దీంతోపాటు చిట్టిరామవరం కూడా ఏజెన్సీలో ఉందని, అందువల్ల అక్కడ భూములకు పట్టాలు ఇవ్వడం లేదని తెలుస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని అభ్యంతరాలు, అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. చట్టం చిక్కుముడులు ఎవరు విప్పాలని మేధావివర్గం అభిప్రాయపడుతున్నది.

మా గ్రామాలను కలపొద్దు..

సుజాతనగర్ మండలంలో ఏడు పంచాయతీలను కలపకుండా కార్పొరేషన్ చేసుకుంటే మాకు అభ్యంతరం లేదు. ప్రతి గ్రామంలో రైతులు ఉన్నారు. కూలీలు ఉన్నారు. కార్పొరేషన్ పరిధిలోకి వెళ్తే ఉపాధి పనులు ఉండవు. రైతులు కూలీలుగా మిగిలిపోతారు. పంట పొలాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాగా వేస్తారు. అందుకే మా సమస్యను వినిపిస్తున్నాం. అభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు.
– కాసాని ఐలయ్య, సీపీఎం సీనియర్ నాయకుడు

పాల్వంచ లేకుండా కార్పొరేషన్ చేయండి..

పాల్వంచలో కొంతభాగం ఏజెన్సీలో ఉంది. అది మినహాయించి కార్పొరేషన్ చేయాలి. రామవరంలో కూడా కొంత ప్రాంతం ఏజెన్సీలోనే ఉంది. చట్టాలను మార్చడం ఎవరితరం కాదు. స్పష్టత వచ్చాక కార్పొరేషన్ చేస్తే బాగుంటుంది. అభివృద్ధి జరిగితే ఎవరూ కాదనరు. కార్పొరేషన్ అవడం మంచిదే కాని చట్టాలకు మినహాయింపు ఉండాలి.
– వాసం రామకృష్ణ, ఆదివాసీ జేఏసీ నాయకుడు